# మాదిగపల్లె

ఎవరోయ్ మాదిగలూ?'

తమ రెవరు బాబయ్యా?'

'మేము బ్రాహ్మలం'

ఈ మాటవిని అతను వులిక్కిపడి, లేచి, రెండడుగులు ముందుకు వచ్చాడు. పాగా తీసి మెడకి చుట్టుకుని వినయం కనపరుస్తూ నమస్కారం కూడా చేశాడు. వయస్సు యాభైయేళ్లుంటాయి. కారునలుపే గాని మొగుమీ్మద కళ వున్నది. నుదురు కొంచెం ఆలోచనాపరుడనీ, సూటిగా వెడతాడనీ చెబుతోంది.

అయితే అలా వెళ్లండి దొరగారూ! ఇది మాదిగపల్లి. లేకపోతే, తమకెవరు కావాలో చెబితే ఆ గానుగు చెట్టు కింద నుంచోండి దొరగారూ, నేను తీసుకువస్తాను.'

'నేను మీ అందరికోసమూ వచ్చిన. ఇది మాదిగపల్లి అని నాకు తెలుసు. మీయిళ్ల మధ్య కాపురం చెయ్యడానికి వస్తున్నాను నేను'.

'మా లచ్చన్న కొంప బేరమాడుతున్నవారు తమరేనా బాబయ్యా'.

'అవునోయ్!'

'తమకెంధుకూ పంతులుగారూ అదీ?'

'చెప్పాను కదూ!'

'తమరు సెలవిచ్చేదంతా విడ్డూరంగా వుంది దేవరా! తమ వంటి ప్రభువులు మాదిగల మధ్య కాపరం...'

'అవును. అందుకోసమే ఆ యిల్లు బేరమాడుతున్నాను. మీతో వేళాకోళాలాడడం లేదు నేను'

'నమ్మలేకుండా వున్నాను బాబయ్యా'.

'చూస్తావు కదూ?'

'అయితే, ముందు ఇలా వచ్చి అరుగుమీద కూచోండి బాబయ్యా.'

'పద'

నేనతని వెనకాలే వెళ్లాను. అతను లోపలికి వెళ్లి చీపురు తెచ్చి, అరుగుతుడిచి 'దయ చెయ్యండి దేవరా అన్నాడు. మేము వాడుకుంటూవున్న చాప తమకి వెయ్యలేను. కిందే కూచామనవలసి వచ్చింది. కోపం వద్దు బాబయ్యా అని చేతులు జోడించుకుని ప్రార్థించాడు.

'మీలో కాపరం చేశాటప్పుడు మీ చాపలు పనికి రాకపోవడం యేమిటోయ్? కాకపోయినా అరుగు చక్కగా తుడిచావు. మరి చాపెందుకూ?

నేను కూచుని, అతన్ని కూడా పక్కని కూచోమన్నాను, కాని యెన్ని విధాల చెప్పినా కూచోకపోవడమే కాకుండా, ఎదురుగా చేతులు కట్టుకుని కింద నుంచున్నాడు.

వూళ్లో వారంతా తమర్ని వెలిపెట్టరా యేమిటి పంతులు గారు?

'ఈ కాలంలో వెలి యేమిటోయ్? అందులోనూ రాజమండ్రి వంటి పట్నంలో కూడానా?'

'తమకిక్కడ పనేమిటండి?'

'మీకు సేవ చెయ్యడం'

అతనిది వినిగతుక్కుమన్నాడు.

'మీతో పాటు కష్టమూ సుఖమూ అనుభవిస్తూ చివరికి మిమ్మల్ని పెద్దకూలాల వారితో సరిసమాన స్థితికి తీసుకువెళ్లడం'

ముందు తమరు మాదిగలయి పోరండీ?'

'అలా అయితేనే నేను తలుచుకున్న పని చెయ్యగలుగుతా. కాకపోయినా. మాదిగలేం పుచ్చిపోయారా? అదీకాక బురదలో కూరుకుపోయిన వాణ్ణి పైకి తియ్యాలంటే తీసేవాడు కూడా ముందు బురదలో దిగవద్దుటోయ్?

ఎవరిచ్చారండి తమ కీ వుద్యోగం?

ఎవరూ యివ్వలేదు. ఒకరిచ్చేది కూడా కాదిది. ఇలాంటి ఉద్యోగం యిచ్చేవారున్నాలేరు అసలిది ఉద్యోగమే కాదు.

అతనికి బోధపడలేదు. మాట్లాడలేకపోయాడు.

ఇది నేను సొంతంగా కల్పించుకొన్నది. సొంతంగా ప్రవేశించింది. ఈశ్వరుణ్ణి ప్రార్థించి. బాగా ప్రార్థించుకోగానేను చెయ్యవలసిన పని యిదే అని తేలింది.

'దీనివల్ల తమకి లాభమేమిటండి?"

'ఫాదరీల కేం లాభం కలుగుతోంది?'

'ఫాదరీల మాట కేం లెండి. భేదాలు లేని జాతి వారిది. కనికరంగల మనుషులు వారు.

'మనం కూడా భేదాలు తీసేసుకుందాం. ఇక కనికరమా? బాగా చూస్తే అది లేని మనిషి లేడు. అయితే, అది కొందరిలో యెక్కువా , కొందరిలో తక్కువా వుంటుంది. ఎక్కువగానే వున్నవారు కూడా కొందరు, కొన్ని కారణాల వల్ల యితర్లకి లొంగిపోయి రాక్షసులయిపోతారు. కాకపోయినా, దొరలలో మాత్రం అందరూ కనికరం వున్నవారే వుంటారా? ఫాదరీలు మాత్రం ఆకాశం నుంచి వూడిపడ్డారా?

'కులాలన్నిటిలోకి తక్కువదీ మాకులం, మమ్మెల్నెవరు కలుపుకుంటారు. దేవరా?'

నేనెలానా వస్తున్నానూ మీలోకీ?

'కోటి కొక్కరు.

'కొన్నాళ్లకి పది మంది. విన్నావా? తరువాత వంద రెండు వందలు

'ఎన్ని యుగాలకి అందరూ యేకమవుతారు బాబయ్యా?'

'భేదం యెన్నాళ్ల నుంచి వుందో చెప్పగలవా?'

'అబ్బో! వోరి నాయన ప్రపంచకం పుట్టినప్పణ్ణుంచీ.'

'తప్పు. తప్పు అది నిజం కాదు. ఈ భేదం తరవాత వచ్చివుందిగాని ఆదిలో లేదు. అయినా, ఇప్పుడు, మళ్లీ మార్పు ప్రారంభం అవుతోంది. దీనివల్ల కలిగే మొదటి లాభమేమిటంటే? భేదానికిక దిగతీతే గాని బిగతీత వుండదు'

నాకేసి చూస్తూనే వొక్క క్షణం ఆలోచించాడు.

'తమ దగ్గిర డబ్బే మాత్రం వుందండీ?

'ఏమాత్రం కావాలంటావ్?'

వొక్క క్షణం పైకి చూశాడు. ఒక మాటు నాకేసి బాగా పరకాయించి చూశాడు.

'బాగా ఆలోచించే చెప్పు'

'ఆలోచిస్తే డబ్బు అక్కర్లేదండీ'

'ఇంకేం మరీ? అసలు నాకు మాన్యాల మీద వచ్చే శిస్తు నా కుటుంబానికే కటాకటీగా సరిపోతుంది. కనుక మీ కోసం నేనే డబ్బు ఖర్చు పెట్టలేను. పైగా, మీ పేరు చెప్పి నేను చందాలు వసూలు చెయ్యను. మీలోనే ఆవేదన కలిగిస్తాను. మీ కులాన్ని మీ చేతులతోనే వుద్ధరింపచేస్తాను. నేను సలహాలు మాత్రమే చెబుతూ వుంటాను. మీ రెక్కల కష్టం తోటే మిమ్మల్ని బాగుచేస్తాను.'

నా మాటలు అతనికి నచ్చినట్టులేదు.

'కొండకీ తల వెంద్రుకలూ ముడి పెడుతున్నారండి.

'నువ్వు సరిగా చెప్పావు. ఏమీ తేడా లేదు. వస్తుందా? కొండకదిలి చక్కా వస్తుంది. లేదూ? నాకు వుత్సాహభంగమే.

కాని మీదేమీ పోదు; కాని మీరు కొంచెం వోపికపడితే రెండేళ్లలోనే మీలో గొప్ప మార్పుచూపిస్తాను.

'అయితే నన్నిప్పుడేం చెయ్యమంటారండీ?'

'నేను, ముందు, మీ కులపెద్దలందరితోటి మాట్టాడాలి. అందర్నీ వొకచోట చేర్చగలవా?'

'దయ చెయ్యండి దొరగారూ'

ఇలా అంటూ పాపన్న, నన్ను, మాదిగపల్లి మధ్యకీ తీసుకువెళ్లి రావిచెట్టు అరుగుమీద కూచోపెట్టి, తాను కులపెద్దల కోసం వెళ్ళాడు.

ధోరణి చూడగా మాదిగల బాగును గురించి యిది వరకే అతను బాగా మధన పడుతూవున్నట్టుంది. 'ఇదీ మనకి మంచిదే' అనుకుంటూ నేను అరుగుమీద చతికిలపడ్డాను.

## 2

ఊహ తెలిసినప్పణ్ణుంచీ యీ భేదాలంటే యెలాగో వుండేది నాకు, కానైతే, నాకు శాస్త్రజ్ఞానంకాని, లోకానుభవం కాని వుందని కాదు; కాని, వొకణ్ణి ముట్టుకో గూడదన్నా, వొకడి దగ్గరికి వెళ్లగూడదన్నా 'ఏం?' అనిపించేది.

చిన్నప్పుడు, మావూళ్లో, నేనూ వొక రాజులపిల్లాడూ జతగా వుండేవాళ్లం. నాలుగోతరగతి దాకా యిద్దరమూ కలిసి చదువుకున్నాము. పాఠశాల లేనప్పుడు అతనూ నేనూ మా యింటోనో వాళ్ల యింటోనో వుండే వాళ్లం. అతను భోజనం చేశాటప్పుడు, నేను, అతని యెదుట, వాళ్ల అమ్మగారు వేసిన పీట మీద కూచుని కబుర్లు చెబుతూ వుండేవాణ్ణి, కాని నేను భోజనం చేశాటప్పుడు. మా వాళ్లు, అతణ్ణి నా యెదుటికి రానిచ్చేవారు కారు. అంటే అతను రాజుల పిల్లాడు, వారు మనకంటే తక్కువ. అన్ని కులాల్లోనూ మనదే గొప్పది. మనం అన్నం తినేటప్పుడు ఇతర కులాల వారెవరూ చూడగూడదు ఏం?... చూస్తే యేం?'

ఈ సందేహం తీరేది కాదు.

ఒకనాడు నేనూ, మా చెల్లాయి మాయింటో నట్టివాకిట్లో చద్దన్నం తింటున్నాము. చివర మా అమ్మ మా యిద్దరికీ మీగడ పెరుగు వడ్డించింది. మే మిద్దరమూ చెరో ముద్దానోట్లో పెట్టుకున్నాము.

అంతే,

సరిగా ఆ సమయంలో 'ముక్కుపుడకలు తయారయినాయండి' అని చెబుతూ రామలింగాచార్యులు తలుపులు తోసుకుని హాల్లోకి వచ్చి, అంతట్లో మమ్మల్ని చూసి, నాలిక కరుచుకుంటూ వెనక్కి చక్కాపోయాడు.

మా చెల్లాయి 'యిక నువ్వు ఆ అన్నం తినకూడ' దంది. మా అమ్మలేచివెళ్లి చెయ్యి కడుక్కురా. మరో కంచంలో మళ్లీ అన్నం పెట్టి పెరుగుపోస్తా'నంది. కాని నేను లేవలేదు. పైగా మరో ముద్దతీసి గభీమని నోట పెట్టుకుని, మూడో ముద్దచేత పుచ్చుకున్నాను. ఆ పళంగా, మా అమ్మ, నా చెయ్యిపట్టుకుని లేవదీసుకుపోయి, చేతిలో వున్న అన్నం బలవంతాన పారేయించి, చెయ్యీ మూతీ కడిగేసింది. దాని మీద నేను కాస్సేపు గంతులు వేశాను, కాని లాభం లేకపోయింది.

అయితే నేను మొదటి కంచం దగ్గిర వుత్తరాపోశనమూ పట్టలేదు. రెండో కంచం దగ్గిర పరిషేచనమూ చెయ్యలేదు. ఆ అన్నమే గబగబ తినెయ్యాలనుకుంటూ వున్న నాకు అది తినకుండా చేయాలనివున్నమా అమ్మకీ కూడా యీ విషయం తోచలేదు. విశ్వబ్రాహ్మణుడు చూసిన అన్నం పారేసింది. ఇది మా అమ్మకి తృప్తి. భోజనం కాగానే నేను రాజుల యింటికి వెళ్లిపోయాను. ఇది నాకు తృప్తి.

మా చెల్లాయి మాత్రం రామలింగాచార్యులు చూసిన అన్నమే పూర్తిగా తినేసింది. మా అమ్మ దాన్నేమీ అనలేదు.

ఏం?

అప్పటికీ యిప్పటికీ కూడా యీ భేదకారణంనాకు బోధపడలేదు.

వైష్ణవులూ, వైఖానసులూ, విశ్వబ్రాహ్మలూ, మరి కొందరూ కూడా, యితర్లు చూస్తూ వుండగా భోజనాలు చెయ్యరు. చివరకి, వారు చంటిపిల్లలకు పెట్టే గోరుముద్దలు కూడా యెవరూ చూడకుండానే జాగ్రత్త పడతారు. కాని ఎవరో ముసలిముత్తయిదువులూ, వితంతువులూ తప్ప తక్కిన స్త్రీలందరూ చాకళ్ళూ,

మంగళ్లూ ఇంట్లో పనిచేసే దాసీలు చూస్తూవుండగా భోజనం చెయ్యడానికి ఒక్కొక్కప్పుడు సందేహించరు. ఆ స్త్రీలు చేసిన వంటలు సోమయాజుల వార్లు కూడ లొట్టలు వేసుకుంటూ పీకల మెయ్యా అరగిస్తారు. ఎవరూ ఆక్షేపించరు.

ఏం?

ఇలాంటి సందేహాలతో నేను పెరిగి పెద్దనయినాను.

కాకినాడ కాలేజీ, హైస్కూలులో నేను, ఫోర్తు ఫారంలో చేరిన మొదటి రోజున వొక మాదిగ పిల్లవాడు వచ్చినా పక్కనే కూర్చున్నాడు. అతను ఫలానా అని తెలిసినప్పుడు నాకేమీ కంగారెత్తలేదు. కాని కొంచెం యెబ్బెట్టుగా మాత్రం వుంది. తరువాత వొక్కవారం గడిచాటప్పటికీ అతనికీ నాకు స్నేహం కలిగింది. కానైతే అతని యింటికి నేను గాని, నాబసకి అతను గాని యెప్పుడూ వెళ్ళడమూ రావడమూ జరగలేదు. స్కూలులో వున్నంతసేపూ మాత్రం వొకళ్లని విడిచి వొకళ్లం వుండలేకపోయేవాళ్ళం. ఇది చూసి బ్రాహ్మణ కుర్రాళ్లు కొందరు, నన్ను పులిని చూసినట్టు చూసేవారు. కొందరు మేష్టారుతో చెబుతావుండు' అనేవారు. అయితే యే మేష్టారూ, యెప్పుడూ నన్ను, సంగతేమిటని అడగలేదూ అతనితో కలిసి మెలిసి వుండవద్దని కూకలు పెట్టలేదూ.

## 3

నేనింటర్మీడియెటులో ప్రవేశించిన సంవత్సరమే నాకు పెళ్లయింది.

అప్పటికప్పుడే నాకు అస్పృశ్యత అమానుషమనే భావం స్థిరపడిపోయి వుంది. సంస్కారం వేపుకి హృదయం పూర్తిగా మొగ్గిపోయి వుంది.

అంచేత అదివరకి పెళ్ళిమాట జ్ఞాపకం వచ్చేటప్పటికి, ఏ సోమయాజులు గారి కూతురు సిద్ధపడుతోందో బాబూ అంటూ భయపడేవాణ్ణి. అయితే, చివరికి, నా భయానికి తగినట్టునొక చయనులు గారి కూతురే, నాకు తటస్థపడింది, గాని నా అదృష్టవశం వల్ల ఆమెపుట్టింట, మహేంద్రవాడలో కాక, అమ్మమ్మ దగ్గిర, రామచంద్రాపురంలో పెరిగింది. పెళ్ళి అయిన సంవత్సరం దాకా - అంటే పదమూడో యేడు వెళ్లేదాకా ఆమె మిషను వారి బాలికా పాఠశాలలో కిరస్తానీ పంతులమ్మల దగ్గిర, మాల మాదిగవగైరా అన్ని కులాల పిల్లల తోటి కూచుని చదివింది. కాని సెకండు ఫోరంలో ప్రవేశించిన మూడు మాసాలికి, అమ్మమ్మ చనిపోగా ఆమె మహేంద్రవాడలో ప్రవేశించింది.

ఆ వయస్సులోనూ, ఆ పరిస్థితుల్లోనూ ఆమె మహేంద్రవాడలో ప్రవేశించడం నాకు చాలా వుపయోగించింది. ఎలాగంటే? తండ్రి నిత్యాగ్ని హోత్రి అన్నలందరూ స్వాధ్యాయవేత్తలు పైగా మా మామగారు సభాపతి. అసలు మహేంద్రవాడ అంటే యెనబయిళ్ల వెల్లానటి అగ్రహారం. వారంతా అచ్చాడీలు, నిప్పు కడిగే రకం. వారిలో చాలామంది శూద్రులు యింటి మజ్జిగ కొనుక్కుంటారు. గాని పసుపు నీళ్లు చల్లకుండా వాడుకోరు దీనికి సాయం సవితి తల్లి, ఆమెకి యెడబిడ్డా, చంటి బిడ్డానూ.

ఒక మూల చాకిరీ చెయ్యలేకా, మరో మూల ఆచారం చెయ్యలేకా, అన్నింటికీ మూలం, సవతి తల్లి యీసడింపులు సహించలేకా ఆమె అత్తవారింటికెప్పుడు వెళ్లిపోతాను దేవుడా అని పరితపించిపోయింది.

మా యింటో కూడా కొంచెం ఆచారబాధవుండినా, మా యిద్దరి ప్రవృత్తీ వొకటి కావడం వల్లా మా యిద్దరికీ సంబంధించినంత వరకూ యే చాదస్తాలూ లేకపోవడం వల్లా పైగా నాకోసం పరితపించిపోయి వుంది కనకనూ ఆమెనేను గీసిన గీటు దాటకుండా నా కనుసన్నలలో మెలగజొచ్చింది.

తొలిమాటు కాపరానికి వచ్చిన రెణ్ణెల్లకి, సంకురాత్రి పండుగకు పుట్టింటికి వెళ్లమని ఆమెని గెంటవలసి వచ్చింది. కాపరానికి వచ్చిన రెండేళ్లకి ఆమె గర్భవతి అయింది. పుట్టింటివారు అయిదోమాసంలో గాజులు పెట్టించారు. అది జరిగి నాలుగు రోజులకి ఆమెను తీసుకుని నేను రాజమహేంద్రవరం బయలుదేరాను.

అప్పుడు నేను బి.ఏ. సీనియరు క్లాసు రాజమండ్రీలో చదువుతున్నాను.

అది నడి వర్షాకాలం ఈ యింటి మీది కాకి ఆ యింటి మీద వాలడం లేదు.

రాయవరం మీదుగా మాచవరం వెళ్లి అక్కడ బస్సు అందుకోవాలి రెండెడ్లబండి యెక్కిమేమిద్దరమూ బయలుదేరాము.

మహేంద్రవాడకీ రాయవరానికీ మధ్య రోడ్డుంది. కాని అప్పటికింకా అది కంకరమొగం యెరుగదు. చక్రాలు, కుచాలదాకా దిగిపోతున్నాయి. పర్వతాల్లాంటి యెడ్లు రెండూ వైతరణిలో యీదుతున్నట్టుంది.

బయలుదేరిన రెండు గంటలికి మా బండి తోట దాటింది. అడ్డుపుంతలోకి వచ్చాం.

ఇంకేం చెప్పను? తలుచుకుంటే యిప్పటికీ వొళ్లు జలదరిస్తాంది. రామారావు! పాతిక సంవత్సరాల మాదిగ స్త్రీ అప్పటికీ ఆమె యెనిమిదో మాసం గర్భవతి కూడా నాలుగేళ్ల పిల్ల. పిల్లకి జ్వరం మందుకోసం ఆస్పత్రికి వెడుతోంది. ఊరికే నడవలేని స్థితిలో పిల్లని యెత్తుకోవడం.

నేనే అనుకుంటే నా భార్య కూడా ఆమె స్థితి చూడలేకపోయింది. స్వయంగా కూడా గర్భవతి కనుక ఆమె మరీ బాధపడిపోయింది.

నా భార్య హృదయం దూసుకుపోయేటట్టు నాకేసి తీవ్రంగా చూసింది. నేను ఆ చూపులు ఆదరంతో స్వీకరించాను.

వెంటనే నా భార్య ఆమెని బండెక్కమని పిలిచింది. నేను చెయ్యి పట్టుకుని ఆమెని యెక్కించి పిల్లని అందించాను. పైగా యెడ్లను, మరింత బాధపెట్టవలసి వస్తుందని నేను నడక ప్రారంభించాను.

అయ్యా, ఆ మాదిగ స్త్రీ సంతోషం యేమి చెప్పను?

***(అక్టోబరు, 1941)***

*(డా॥ కె. లక్ష్మినారాయణ సంకలనం చేసిన "దళిత కథలు - 3 నుండి)*